క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 13, వంకాయ 23, బెండ 38, పచ్చిమిర్చి 35, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 11, క్యారెట్ 15. దొండ 35, ఆలు 18, ఉల్లి 12, గోకర 50, దోస 23, సొర 09, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 60, అర్వి 50, మునగ 28, చిలగడదుంప 28, బీట్‌రూట్ 15, కీర 13, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 45. శనివారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

రేపు హోసన్న మందిరంలో ఈస్టర్ వేడుకలు

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో భరత్‌నగర్ కాలనీలోని హోసన్న మందిరంలో ఆదివారం సూర్యోదయ ఆరాధన కార్యక్రమం ఎల్‌బీనగర్‌లోని క్రైస్తవ సంఘాలతో కలిసి నిర్వహిస్తున్నట్లు ఎల్‌బీనగర్ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ దేవానంద్ తెలిపారు. కార్యక్రమానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పాస్టర్ బెంజమిన్ శాస్త్రి పాలాది హాజరవుతారని తెలిపారు.

సింగరేణి కాలనీలో..

సైదాబాద్: జీసస్ పునరుజ్జీవుడైన ఈస్టర్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లిమెల్లి మోజెస్ తెలిపారు. శుక్రవారం సైదాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 9న సింగరేణి కాలనీ పెట్రోల్ బంక్ సమీపంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో యాకత్‌పురా పాస్టర్స్ అండ్ క్రిస్టియన్ లీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఈస్టర్ సన్‌రైజ్ ఆరాధన వేడుకలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా హెచ్‌పీఎఫ్ మినిస్ట్రీస్ సిస్టర్ ఎం.జ్యోతి రాజేశ్వర్‌రావ్, స్పీకర్‌గా గ్లోబల్ బంజారా బాప్టిస్ట్ మినిస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి పాస్టర్ కె.శ్రీనివాస్ నాయక్, రెవరండ్ డాక్టర్ భీముడునాయక్ పాల్గొంటారన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న స్థానికులు

హస్తినాపురం: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ యోగాసనాలు వేయాలని శ్రీ షిరిడీసాయి అష్టాంగ యోగా శిక్షణ వ్యవస్థాపకుడు ఇస్మాయిల్ గురూజీ అన్నారు. షిరిడీ సాయి అష్టాంగ యోగ శిక్షణ కార్యక్రమాలు కర్మన్‌ఘాట్ లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కర్మన్‌ఘాట్ పరిసరాల్లోని కాలనీవాసులు ఈ యోగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ గురూజీ మాట్లాడుతూ, ప్రస్తుతం కోవిడ్ వంటి భయాలు వెంటాడుతున్న తరుణంలో శరీరంలో వ్యాధి నిరోధక వ్యవస్థను పెంచుకోవడానికి ఈ యోగా శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని సూర్యనమస్కారాలు, ఆసనాలు నేర్చుకోవాలని ఇస్మాయిల్ గురూజీ అన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ నర్సింహగుప్తా

చైతన్యపురి: కాలనీల్లోని సమస్యలను పరిష్కరించి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నానని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. డివిజన్‌లోని బాబు కాంప్లెక్స్, ఫణిగిరి కాలనీ, ప్రభాత్‌నగర్ కాలనీల్లో శుక్రవారం ఆయన పర్యటించి స్థానికులను ఆయా కాలనీల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు ఉన్నాయని, పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం

బడంగ్‌పేట్: వేసవిలో విద్యుత్ అంతరాయంతో పాటు లోఓల్టేజీ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు 5వ డివిజన్ కార్పొరేటర్ బోయపల్లి దీపికారెడ్డి తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని 5వ డివిజన్ వినాయకహిల్స్ ఫేస్–2లో కొంత కాలంగా లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె మంత్రి సబితారెడ్డి సహకారంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. వెనువెంటనే కాలనీలో బిగించారు. శుక్రవారం కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. వేసవికాలంలో విద్యుత్ సమస్య లేకుండా చూస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు బోయపల్లి శేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఉన్నారు.

సర్వీస్‌రోడ్ల ఆక్రమణతో ట్రా‘ఫికర్’

- సర్వీస్‌రోడ్లపై తోపుడుబండ్ల వ్యాపారుల తిష్ట
- రోడ్లు కుంచించుకుపోయి రాకపోకలకు కాలనీవాసుల ఇక్కట్లు
- సాయంత్రం వేళల్లో కనీసం నడిచి వెళ్లలేని పరిస్థితి
- ఎమ్మెల్యే దృష్టికి ట్రాఫిక్ సమస్య



చైతన్యపురి మెట్రోస్టేషన్ సమీపంలోని సర్వీస్‌రోడ్డులో ఆక్రమణలు

చైతన్యపురి: చిరు వ్యాపారులు, తోపుడుబండ్లు ఆక్రమించుకోవటం వల్ల సర్వీస్ రోడ్లు కుంచించుకు పోయి వాహనదారులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక్కడ నుంచి గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ తరలి వెళ్లినప్పటికీ.. వ్యాపారాలు ఇంకా ఇక్కడే కొనసాగిస్తుండటంతో స్థానికులు కొత్త సమస్యలను ఎదుర్కొంటున్నారు.

- చైతన్యపురి డివిజన్‌లోని చైతన్యపురి చౌరస్తా నుంచి కొత్తపేట బీఎస్ఎన్ఎల్ కార్యాయం వరకు ఉన్న సర్వీస్ రోడ్డు, ప్రభాత్‌నగర్ కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారిలో చిన్న ట్రాలీ ఆటోల్లో పండ్లను పెట్టుకొని విక్రయిస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రోడ్లపై అక్రమ పార్కింగ్‌ల కారణంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.
- ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌ల వల్ల ప్రభాత్‌నగర్ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు చైతన్యపురి మెట్రో స్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల రాకపోకలకు కష్టమవుతోంది.



ప్రభాత్‌నగర్ కాలనీ మలుపులో సర్వీస్ రోడ్డుపై ఆక్రమణలు

- సర్వీస్ రోడ్డు పక్కనే రెండు జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. ట్రాఫిక్ జామ్ అయి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
- ప్రభాత్‌నగర్, సత్యనారాయణపురం, మారుతీనగర్, సాయినగర్, కాలనీలకు ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, కార్లు, పాదచారులు ఈ సర్వీస్ రోడ్డు మీదుగానే కాలనీల్లోకి వెళ్లాల్సి ఉంటుంది.
- సర్వీస్ రోడ్డు ఆక్రమణలకు గురి కావటంతో సాయం కాలం వేళల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు అటుంచి కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంటోంది.
- పుట్‌పాత్‌ను ఆక్రమించుకోవటమే కాకుండా కొందరు సర్వీస్ రోడ్డుపైనే తమ వస్తువులు పెట్టుకుని వ్యాపారాలు కొనసాగించటం వల్ల సమస్య మరింత పెరుగుతోంది.
- కాలనీ రోడ్డుపై పండ్ల వ్యాపారుల వాహనాలను నిలపకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందంటున్నారు.
- వారం రోజుల క్రితం జరిగిన కాలనీ సమావేశంలో కూడా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామని, సమస్య పరిష్కరించాలని కోరామని తెలిపారు.
- సర్వీస్ రోడ్లు ఆక్రమించుకోవటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కనీసం జీహెచ్ఎంసీ అధికారులు కానీ, ట్రాఫిక్ అధికారులు కానీ పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



చైతన్యపురి చౌరస్తా నుంచి కొత్తపేట క్రాస్ రోడ్డు వరకు ఉన్న సరీ్వసు రోడ్ల ఆక్రమణలకు గురి కావటం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సర్వీస్ రోడ్డులో కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా ఉండంటం లేదు. ప్రభాత్‌నగర్ కాలనీలోకి వెళ్లే మార్గంలో కార్లు, ద్విచక్ర వాహనాలు నడపటం అంటే పద్మవ్యూహంలోకి వెళ్లినంత పని అవుతోంది. హెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసు అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలి.

– పల్‌రెడ్డి రమణారెడ్డి, ప్రభాత్‌నగర్ కాలనీ

ముస్లిం బస్తీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తా..



రంజాన్ కానుకలను అందజేస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్‌లోని ముస్లిం బస్తీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి బస్తీవాసులకు హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన కాలనీలో పాదయాత్ర నిర్వహించి శ్మశాన వాటికలో వెలగని వీధి దీపాలు, తరలింపునకు నోచుకోని చెత్త కుప్పలు, ఇతర పారిశుద్ధ్య సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత సిబ్బందిని కాలనీకి రప్పించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జామా మసీదులో ఆయన ముస్లిం సోదరులకు ప్రభుత్వం మంజూరు చేసిన రంజాన్ కానుకల కిట్లను తన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మసీదు నిర్వాహకులు ఫిరోజ్ ఆదమ్‌ఖాన్, సలీమ్, ముంతాజ్‌ఖాన్, తంజీద్‌ఖాన్, దర్వేష్, నాయకులు పాశం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

‘రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోంది’



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్‌టీపీ నేతలు

మన్సూరాబాద్: విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్ కోసం వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపు మేరకు వైఎస్సార్‌టీపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మామిడి రాంచందర్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద శుక్రవారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందని, విద్యార్థులు, నిరుద్యోగులను కేసీఆర్ ప్రభుత్వం నట్టేట ముంచుతోందని మండిపడ్డారు. పేపర్ లీకేజీ ప్రధాన పాత్రదారులను విస్మరించి, చిరుద్యోగులపై చర్యలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కోట్ల వాసుదేవ్, పల్లే అజయ్, రమావత్ రవి, ఎస్కేమాసుమ్, సత్తిరెడ్డి, కోమల, లక్ష్మణ్, పోచబోయిన శ్రీకాంత్‌యాదవ్, మధుసూదన్, చారి, కృష్ణనాయక్; రాము, పాశం అనిల్‌రెడ్డి, సాంబయ్య, వెంకటేష్, జనార్దన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



5కే వాక్‌ను ప్రారంభిస్తున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

దిల్‌సుఖ్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్‌కేపురంలోని ఓజోన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆరోగ్యానికి నడక ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు 5కే వాక్ నిర్వహించారు. ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ ముఖ్యఅతిథిగా విచ్చేసి 5కే వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని, మన దగ్గర ఎన్ని డబ్బులు ఉన్నా.. ఆరోగ్యం లేకపోతే అన్నీ వృథా అని అన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కొత్త సమయం నడవాలని సూచించారు. కొత్తపేటలోని ఓజోన్ హాస్పిటల్స్ నుంచి ప్రారంభమై 5కే వాక్ ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వరకు కొనసాగింది. ఓజోన్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఇంద్రసేన రెడ్డి, సీఓఓ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, లయన్ యాదయ్యగౌడ్, పగిళ్ల భూపాల్‌రెడ్డి, డాక్టర్ విజయరంగ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి దళిత రత్న అవార్డులు





అవార్డు అందుకుంటున్న చిట్టుపాక ప్రభాకర్, మధిర సత్యనారాయణ

చాదర్‌ఘాట్, మలక్‌పేట, మన్సూరాబాద్: మలక్‌పేట నియోజకవర్గ దళిత నేత, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టుపాక ప్రభాకర్, నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జ్ బట్టు రామకృష్ణ, ఆలిండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌత్ రీజియన్ రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణలకు రాష్ట్ర ప్రభుత్వం ‘దళితరత్న అవార్డు’ అందజేసింది. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన వేడుకల్లో డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్–2023 జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఉత్సవాల కమిటీ వర్కింగ్ చైర్మన్ మేడి పాపయ్య చేతుల మీదుగా బట్టు రామకృష్ణ, మధిర సత్యనారాయణ అవార్డులను అందుకోగా, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ రమేష్‌కుమార్, టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ చేతుల మీదుగా చిట్టుపాక ప్రభాకర్ అవార్డును స్వీకరించారు.

మనస్తాపంతో వ్యక్తి అదృశ్యం



శివకుమార్ (ఫైల్)

హస్తినాపురం: భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...ఎఫ్‌సీఐ కాలనీ నివాసి కైరకొండ శివకుమార్ (30)కు అదే కాలనీకి చెందిన ప్రసన్నతో వివాహం జరిగింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరుగుతోంది. గురువారం భార్యతో మళ్లీ గొడవ జరగడంతో మనస్తాపం చెందిన శివకుమార్ ఇంట్లోని వారికి చెప్పకుండా బైక్ (నం.టీఎస్08జీఏ 7763)పై బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కంగారుపడ్డ కుటుంబ సభ్యులు శివకుమార్ ఆచూకీ కోసం బంధు,మిత్రులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూలే జయంత్యుత్సవాల కమిటీ చైర్మన్‌గా అంజి

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 11 న నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే జయంత్యుత్సవాల ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా జిల్లాపెల్లి అంజిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ప్రస్తుతం ఆయన రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. బీసీ విద్యార్థి సమస్యలపై పదేళ్లుగా పోరాడుతున్నారు.

ముంపు ముప్పు అరికట్టేందుకు మూడో టన్నెల్

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేసుధీర్‌రెడ్డి

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు పరిసరాల్లోని లోతట్టు కాలనీలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు మూడో టన్నెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ సందర్శించిన ఎమ్మెల్యే అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు.వర్షాకాలంలో చెరువు నీరు ఓవర్ ఫ్లో కాకుండా నీటి మట్టాన్ని నియంత్రించేందుకు టన్నెల్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రెండు మార్గాల ద్వారా నీరు బయటకు విడుదల చేస్తున్నారని, ఇప్పుడు నిర్మించే మూడో టన్నెల్ వల్ల అవసరమైన సమయంలో నీటిని త్వరగా బయటకు పంపవచ్చని అన్నారు. మూడు, నాలుగు నెలలుగా పనులు నత్తనడకన నడుస్తున్నాయని, పనుల్లో వేగం పెంచి ఈ నెలాఖరు వరకు పూర్తి చేస్తామన్నారు. అంచనాలను మించి ఖర్చు అవుతున్నందువల్ల కాంట్రాక్టర్‌కు అదనంగా చెల్లించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, డివిజన్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, నాయకులు రమేష్ ముదిరాజ్, కృష్ణ, శివరాం, సుధీర్, వర్షిత్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



మోహన్‌నగర్‌లోని ఫుల్ గోస్పెల్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ దేవానంద్



వనస్థలిపురం లిటిల్ ల్యాంబ్ చర్చిలో ప్రార్థనలు



కేటీ నగర్ బేతనియ చర్చిలో ప్రార్థనలు



క్రిస్టియన్ లైఫ్ సెంటర్‌లో స్తుతి గీతాలు ఆలపిస్తున్న క్వాయర్ టీమ్

ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం: క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలోని చర్చిల్లో యేసుక్రీస్తు త్యాగాన్ని కొలుస్తూ ప్రత్యేక ప్రార్థనలు, భక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా పాస్టర్లు యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను, శిలువ వేయడానికి ముందు జరిగిన ఘటనలను భక్తులకు క్లుప్తంగా వివరించారు.

- కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని సెయింట్ మాథ్యూస్ ఫుల్ గోస్పెల్ మినిస్ట్రీస్ చర్చిలో జరిగిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో చర్చి పాస్టర్ రెవరెండ్ ఎం.దేవానంద్ భక్తులకు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. సంఘ పెద్దలు ప్రసాద్ ప్రసన్న, సువర్ణప్రసాద్ కవిత, అనిల్ కుమార్ పల్లవి, ప్రశాంత్ కుమార్, మోహన్ గ్రేస్, జయలక్ష్మి, సువార్త రాణి పాల్గొన్నారు.
- వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా సిలువ ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవరెండ్ కోన శౌరిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాస్టర్ రెవరెండ్ కె.సుదర్శనరావు, చర్చి అధ్యక్షుడు టీఎస్ బాబూరావు, ఉపాధ్యక్షుడు జార్జిముల్లర్, కోశాధికారి సురేష్‌కుమార్, కార్యదర్శి భానుకిరణ్, సంయుక్త కార్యదర్శి జాన్ తదితరులు పాల్గొన్నారు.
- మలక్‌పేట నియోజకవర్గం కేటీనగర్‌లోని బేతనియ బాప్టిస్టు చర్చి, మూసారంబాగ్‌లోని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. క్వాయర్ టీమ్ సభ్యులు స్తుతిగీతాలు ఆలపించారు. బేతనియ చర్చిలో పాస్టర్ రెవరెండ్ సామ్యేల్ బాబు బైరపోగు మాట్లాడుతూ, యేసుక్రీస్తు కనబరిచిన ప్రేమ, క్షమాగుణాన్ని అందురూ అలవర్చుకోవాలన్నారు. పాస్టర్లు రెవరెండ్ సైలస్ రిజినాల్డ్, పాస్టర్ షీలా డోరతి, రెవరెండ్ డాక్టర్ గంగెపోగు ఆండ్రూస్, డేనియల్ కొత్తపల్లి, ప్రేమ్‌కుమార్, దేగపోగు వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా జీవించడం అందరి హక్కు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్

సైదాబాద్: ఆరోగ్యంగా జీవించడం ప్రతి ఒక్కరి హక్కు అని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.మురళీమోహన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల సదనంలో హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సిటీ సివిల్ కోర్టు ఆధ్వర్యంలో రుచిత ట్రస్ట్, పారామిత హాస్పిటల్స్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగంలోని జీవించే హక్కులో ఆరోగ్యంగా జీవించడం అనేది భాగమని అన్నారు. అందరూ ఆరోగ్య సూత్రాలు కచ్చితంగా పాటించాలన్నారు. వైద్యశిబిరం నిర్వాహకులను, వైద్య సిబ్బందిని ఆయన అభినందించారు. రుచిత ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ సతీష్, డాక్టర్ ప్రతీక్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డీఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ సునీత, బాలల సదనం సిబ్బంది పాల్గొన్నారు.

‘ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా?’



మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జ్

చైతన్యపురి: ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా అని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి ప్రశ్నించారు. ఎస్ఎస్‌సీ ప్ర శ్న పత్రాల లీకేజీపై ఆందోళన చేసిన కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడంపై ఆయన ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్న పత్రాలను లీక్ చేస్తూ నిరుద్యోగ యువత జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రికి ఆత్మీయ సమ్మేళనంపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్ నిర్ణయించే పరీక్షలపై లేకుండా పోయిందన్నారు. ఒక మంత్రిగా ఉన్న ఆమె ప్రభుత్వ కార్యక్రమంలో తహసీల్దార్‌ను నిల్చోబెట్టి, ప్రభుత్వంతో సంబంధం లేని వ్యక్తులను స్టేజీపై కూర్చోబెట్టిందని, ఆమెకు అధికారులంటే ఎంత చిన్నచూపో ఈ ఘటన తెలియజేస్తోందని అన్నారు. ఉన్నతాధికారి అయినప్పటికీ తనను మొబైల్ ఫోన్‌ను పరీక్ష కేంద్రంలోకి తీసుకుని పోవద్దన్న మహిళా కానిస్టేబుల్ కల్పనను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అభినందించడమే కాకుండా సక్రమంగా విధులు నిర్వహించినందుకు రివార్డు ప్రకటించారని అన్నారు. సక్రమంగా విధులు నిర్వహించే ప్రభుత్వ అధికారులను ఎలా గౌరవించాలో ఆయనను చూసి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నేర్చుకోవాలని హితవు పలికారు. ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదం మోపుతూ అణచివేసే కుట్ర చేస్తున్న తెలంగాణ నిరంకుశ ప్రభుత్వాన్ని త్వరలో కూల్చే రోజులు దగ్గర పడ్డాయన్నారు.

సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ కరపత్రం ఆవిష్కరణ



ఎల్‌బీనగర్‌లో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

మన్సూరాబాద్: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 11న జరుగనున్న సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఆవిర్భావ సభ కరపత్రాన్ని ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫ్రంట్ కన్వీనర్ బొంగు ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ, భావసారూప్య పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక న్యాయవాదులు, ప్రజాస్వామ్యవాదులందురూ ఒక వేదికపైకి వచ్చి ఫ్రంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫ్రంట్‌కు చైర్మన్‌గా ప్రొఫెసర్ మురళీ మనోహర్, కో చైర్మన్‌గా మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఉన్నారని తెలిపారు. సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు చామకూర రాజు, ఫ్రంట్ కో కన్వీనర్లు మంగిలపల్లి శంకర్ గంగపుత్ర, కేవీగౌడ్, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గోర శ్యాంసుందర్‌గౌడ్, బీసీ జర్నలిస్ట్ ఫోరం నాయకులు శ్యాంయాదవ్, రాకేష్, మహేష్, అభిషేక్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.